క్లుప్తంగా

వైభవంగా సీతారాముల కల్యాణం

వాల్మీకిపురం : స్థానిక శ్రీ పట్టాభిరామాలయంలో శనివారం శ్రీరాముడి జన్మ నక్షత్రమైన పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకొని శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి సేవా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం స్వామి వారికి అర్చన, అభిషేకం, తోమాలసేవ తదితర కార్యక్రమాల అనంతరం విశేష అలంకరణలో ముస్తాబైన ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ తిరుచ్చిపై అధిరోహింపజేశారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల నడుమల కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, సిబ్బంది దుశంత్, భక్తులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

పీలేరు రూరల్ : సంక్రాంతి సంబరాలు పురస్కరించుకుని పీలేరు పోలీస సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కోడిపందేలు, జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, ర్యాష్ డ్రైవింగ్ లాంటి చర్యలకు పాల్పడితే ఉపేక్షించబోమన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా రఘు

బి.కొత్తకోట : ఎమ్మార్పీఎస్ మండల నూతన అధ్యక్షుడిగా రఘును ఎన్నుకొన్నారు. శనివారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుమ్ము చిన్నా అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్ బలోపేతం అవుతోందని, ఎస్సీల వర్గీకరణ కోసం పోరాటాలు ఉధృతం చేస్తామని రఘు చెప్పారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు సమీపంలో జింకలమిట్ట క్రాస్ వద్ద శనివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో మండలంలోని మద్దయ్యగారిపల్లికి చెందిన నెర్లిపల్లి వెంకటేష్ (28), పులికల్లుకు చెందిన తలారీ చంద్రశేఖర్ (26) కర్నాటక రాష్ట్రం నుంచి ద్విచక్ర వాహనంలో అక్రమంగా గోనెసంచిలో 96 మద్యం ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డారు. మద్యంతో పాటు వాహనాన్ని సీజ్ చేసి నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేసామని ఎస్ఐ మధు రామచంద్రుడు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

బి.కొత్తకోట : జగనన్న కాలనీల్లో చేపట్టిన పక్కా గృహ నిర్మాణాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీఓ మంగళం శంకరయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన నిర్మాణాలపై సమీక్షిస్తూ నిర్మాణాలు మందగించకుండా చూడాలన్నారు. సంక్రాంతి నాటికి నిర్దేశించిన నిర్మాణ లక్ష్యాలను సాధించాలన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలో నడుపుదాం

మదనపల్లె సిటీ : ఆర్టీసీని లాభాల బాటలో నడిపేందుకు సిబ్బంది అందరూ కలిసి సమష్టిగా కృషి చేయాలని స్థానిక డిపో–2 మేనేజర్ ఆర్వీ నిరంజన్ అన్నారు. శనివారం స్థానిక డిపోలో ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి ఆదాయం పెంచాలన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈపీకెలో డ్రైవర్లు రెడ్డప్ప, రత్నం, మురళి, కెఎంపీఎల్‌లో డ్రైవర్లు ఆర్ఎల్ రెడ్డి, పి.వి.కె.రెడ్డిలను క్యాష్ అవార్డులు అందజేశారు.

అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక

కేవీపల్లి : అర్హతగల ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ పింఛన్ కానుక అందుతున్నట్లు ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కారపాకుల భాస్కర్ నాయుడు అన్నారు. శనివారం మండలంలోని తిమ్మాపురంలో కొత్తగా మంజూరైన 16 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో ఇప్పటి వరకు 90 శాతం అమలు చేశారని తెలిపారు. ఇచ్చిన హామీలే కాకుండా ఎన్నో సరికొత్త పథకాలు తీసుకొచ్చి పేదల పాలిట పెన్నిధిగా నిలిచారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, నాయకులు ముద్దుకృష్ణ, రామ్మోహన, రెడ్డెప్ప, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమాను సద్వినియోగం చేసుకోండి

కలకడ : ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైఎస్సార్ బీమాను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీఓ నారాయణ అన్నారు. శనివారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ మాదిగపల్లెకు చెందిన అంజనయ్య గుండెపోటుతో మృతిచెందగా వైఎస్సార్ బీమా కింద రూ.లక్ష మంజూరు అయింది. ఈ చెక్కును శనివారం వారి ఇంటికి వెళ్లి మృతుడి భార్య ఈశ్వరమ్మకు అందజేశారు. పంచాయతీ కార్యదర్శి నందిని, వలంటీర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తి

గడప, గడపలో ఎమ్మెల్యే ఎదుట ప్రజల హర్షం

పెద్దతిప్పసముద్రం : సీఎం జగనన్న ప్రభుత్వంలో అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలతో మేమంతా సంతృప్తిగా ఉన్నాం అంటూ తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి ఎదుట ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం ఎమ్మెల్యే మండలంలోని రంగసముద్రం, సాలేవాండ్లపల్లి, విసనకర్రవాండ్లపల్లి, తోటవారిపల్లి, కాసేవాండ్లపల్లి, కొత్త సుబ్బరాయునిపల్లి, కుర్రావాండ్లపల్లి, బొంతావారిపల్లి గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు మంజూరైన పథకాల బుక్‌లెట్లను అందజేశారు. పార్టీలకతీతంగా అర్హులైన వారికి ఇళ్ల వద్దకే పథకాలు అందుతున్నాయని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీల కన్నా ప్రజా ప్రయోజనకరమైన పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తుంటే వాటిని జీర్ణించుకోలేని చంద్రబాబు ఎక్కడ టీడీపీ ఉనికి కోల్పోతుందోనని భయంతో సీఎంపై అర్థరహితమైన వ్యాఖ్యలు చేస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించి మళ్లీ సీఎం చేయాలని అభ్యర్థించారు. సిమెంటు రోడ్లు, మురికి కాలువలు, గతంలో ప్రజలకు ట్యాంకర్లతో సరఫరా చేసిన నీటి బిల్లులు మంజూరు చేయాలని పలువురు కోరగా తక్షణం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీపీ మహమూద్, జెడ్పీటీసీ శివన్న, కన్వీనర్ సుబ్బరాం, సొసైటీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ బాబురెడ్డి, ఎంపీటీసీ సుజాత, స్థానిక నాయకులు కొండా సిద్దార్థ, సవరాల రవిశంకర్, శివ, సుబ్రమణ్యం, చలపతి, రామిరెడ్డి, లక్ష్మీపతి, సుధాకర్, కిట్టతో పాటు మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు, పథకాలపై చర్చిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి

సచివాలయ సిబ్బంది పని తీరు భేష్

రంగసముద్రం సచివాలయంలో పని చేసే సిబ్బంది పని తీరు భేషుగ్గా ఉంది. ఎక్కడా ఎలాంటి సమస్యలు లేకుండా ప్రభుత్వ పథకాలను ప్రజలకు క్షుణంగా వివరిస్తూ అర్హులైన ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నారని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కితాబు నిచ్చారు.

ఎందాకైనా చదివిస్తా..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని రంగసముద్రం పంచాయతీ తోటావారిపల్లికి చెందిన చంద్రోశేఖర్, రెడ్డి శోభా దంపతులకు కలిగిన ఏకైన సంతానం నందిని. ప్రస్తుతం బాలిక రంగసముద్రం జెడ్పీ హైస్కూల్‌లో తొమ్మిదవ తరగతి చదువుతోంది. ఆ చిన్నారి ఏడేళ్ల వయసులో ఉండగా తండ్రి చంద్రశేఖర్ మృతి చెందాడు. కన్న తల్లే బాలికను కంటికి రెప్పలా చూసుకుంటూ చదివించుకుంటోంది. ఈ నేపథ్యంలో ఇటీవల తల్లి రెడ్డి శోభా అనారోగ్యం కారణంగా కన్ను మూసింది. ప్రస్తుతం బాలిక పెద్దమ్మ శంకరమ్మ సంరక్షణలో ఉంది. శనివారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి బాలిక దీనస్థితి విని చలించి పోయారు. కన్నవాళ్ళు లేరని కృంగిపోకు, మీ అమ్మా, నాన్నల ఆశయాలు నెరవేర్చేందుకు ప్రయత్నించు, ఎందాకైనా నేను చదివిస్తా, నీకు నేను ఉన్నా అంటూ ఎమ్మెల్యే బాలికకు భరోసా ఇచ్చి మనోధైర్యం నింపారు.

జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు

• ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : అన్నమయ్య జిల్లాలో అతిపెద్ద లేఅవుట్‌గా రూపుదిద్దుకుంటున్న పోతబోలు వైఎస్సార్ జగనన్న కాలనీ లేఅవుట్‌కు దూరం తగ్గనుంది. ఎమ్మెల్యే నవాజ్‌బాషా చొరవతో...పట్టణం నుంచి పోతబోలు లేఅవుట్‌కు ప్రస్తుతం ఉన్న 7 కి.మీలను ప్రజల సౌకర్యం కోసం టిడ్కో భవనాల నుంచి నేరుగా వేస్తున్న రహదారితో కేవలం 4 కి.మీల దూరానికి తీసుకువచ్చారు. ఇందుకోసం 4.2 ఎకరాల భూసేకరణకు రూ.90 లక్షలు, రహదారి ఏర్పాటుకు రూ.27లక్షలు మొత్తం కలిపి రూ.1.27 కోట్లు వ్యయం చేయనున్నారు. శనివారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి టిడ్కో భవనాల నుంచి పోతబోలు లేఅవుట్‌కు వేయనున్న నూతన రహదారికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 32 లక్షలకు పైచిలుకు గృహనిర్మాణాలకు శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగా ప్రతి జగనన్న కాలనీ లేఅవుట్లలో ప్రజల నివాసాలకు అవసరమైన అన్ని మౌలికవసతుల కల్పన దిశగా చర్యలు తీసుకుంటున్నారన్నారు. మదనపల్లె మున్సిపాలిటీకి సంబంధించి 15,000 ఇళ్లు మంజూరైతే, వాటిలో 3,188 ఇళ్లు పోతబోలు లేఅవుట్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వీటికి ఆనుకుని రాచవేటివారిపల్లె పంచాయతీలో మరో 200 ఎకరాల భూసేకరణ చేశామని, అందులో సుమారు 4,000 మందికి ప్లాట్లు మంజూరు చేస్తామన్నారు. వీటన్నంటితో కలుపుకుంటే పోతబోలు లేఅవుట్ ఒక కాలనీగా కాకుండా పట్టణంగా ఏర్పాటవుతుందన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, హౌసింగ్ డీఈ రామస్వామిరెడ్డి, ఏఈ దీనదయాళ్‌రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తట్టి శ్రీనివాసులురెడ్డి, సదాశివరెడ్డి, పోతబోలునాగరాజ, సిద్దలవేమారెడ్డి, సర్పంచ్ ఈశ్వరయ్య, శరత్‌రెడ్డి, దండుకరుణాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పసుపులేటిరమణ, కౌన్సిలర్ సుగుణ పాల్గొన్నారు.


పోతబోలు లేఅవుట్‌కు రహదారి ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

సంక్షేమ పథకాలతో పేదల అభ్యున్నతి

మదనపల్లె : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో బడుగు, బలహీనవర్గాల వారు అభివృద్ధి చెందుతున్నారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శనివారం పట్టణంలోని 28వవార్డులో కౌన్సిలర్ షేక్ వసీంఅక్రమ్ ఆధ్వర్యంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరా తీశారు. కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, డిష్‌రామకృష్ణారెడ్డి, రామిశెట్టిశివయ్య, ఈశ్వర్‌నాయక్, సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి, నాయకులు మెట్రోబాబ్‌జాన్, ఆంజనేయులు, మంజుల, గట్టుచంద్రశేఖర్‌నాయుడు, జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

కలకడ : ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలని రాయచోటి డీఎస్పీ శ్రీధర్ అన్నారు. రాత్రి సమయంలో ఎలాంటి స్టిక్కర్లు, ప్రమాద సూచికలు లేకుండా రోడ్లపై ఎద్దులబండ్లు తిరగడంతో అధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. శనివారం కలకడ టౌన్‌కు చెందిన ఎద్దుబండ్ల యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. చిత్తూరు–కర్నూలు జాతీయరహదారిపై ఎక్కువగా ఎద్దుల బండ్ల ప్రమాదాలు జరిగాయని గుర్తు చేశారు. ప్రతి ఎద్దుల బండికి నాగువైపులా ఎరుపు రంగు రేడియం స్టిక్కర్, ఎద్దు కొమ్ములకు ఎర్ర స్టిక్కర్ ఏర్పాటు చేయాలని, బండి నడిపే వ్యక్తులు రేడియం జాకెట్ విధిగా ధరించాలన్నారు. రాత్రి సమయంలో ప్రయాణం తగ్గించాలని సూచించారు. రాయచోటి డివిజనల్ పరిధిలో ఎక్కడ కోడిపందెలు, పేకాట పూర్తి నిషేధమన్నారు. కార్యక్రమంలో సీఐ నాగేంద్ర, ఎస్ఐ సిటి స్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

ముమ్మరంగా ఈ క్రాప్ నమోదు

గుర్రంకొండ : రబీసీజన్ ప్రారంభం కావడంతో మండలంలోని పలుగ్రామాల్లో ఈక్రాప్ నమోదు కార్యక్రమం ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గత నాలుగు రోజులుగా గ్రామాల్లో సచివాలయ వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ సిబ్బంది, ఉద్యోగులు పొలాల బాట పట్టారు. వ్యవసాయ, ఉద్యాన శాఖకు చెందిన అన్ని రకాల పంటల సాగును ఈక్రాప్ ద్వారా ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు. రైతులు తమ పొలాల్లో పంట సాగు చేపట్టి ఉంటనే ఈ క్రాప్ నమోదు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని సచివాలయ ఉద్యోగులు రైతులకు సూచిస్తున్నారు. ఈక్రాప్ నమోదు చేసుకొంటేనే బ్యాంకుల్లో పంట రుణాలుఇస్తారని రైతులకు ఆవగాహన కల్పిస్తున్నారు. వాస్తవంగా పంట సాగు చేసిన రైతులకే ఈక్రాప్ నమోదు చేస్తూ అర్హులైన రైతులకు ఎక్కడా అన్యాయం జరగకుండా ప్రతి పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

పింక్ బస్ వైద్య సేవలు మహిళలకు వరం

కేవీపల్లె : ఉచితంగా కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి పింక్ బస్ వైద్య శిబిరం పేద మహిళలకు వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. శనివారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గజ్జెల శృతి సహకారంతో మండలంలోని గర్నిమిట్టలో పింక్‌బస్ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ పేద మహిళలను ఆదుకోవడమే లక్ష్యంగా ఎంతో విలువతో కూడిన కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేస్తూ పింక్ బస్సు వైద్య సేవలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ మాట్లాడుతూ శిబిరంలో మొత్తం 192 మంది మహిళలకు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, నిర్వాహకులు గజ్జెల శీన్‌రెడ్డి, ఎంపీపీ ఈశ్వరమ్మ, వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి, సర్పంచ్‌లు రమణమ్మ, రత్నాకర్‌రెడ్డి, స్విమ్స్ ఏడీ రాజశేఖర్, వైద్యులు శ్రీనిజ, అశ్రిత, పావని, దీప్తి, రోహిణి, సబిత తదితరులు పాల్గొన్నారు.


పింక్‌బస్ వైద్యశిబిరం ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి

జోయాలుక్కాస్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం

మదనపల్లె : ప్రముఖ జువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్ వినియోగదారులకు ప్రత్యేకమైన షాపింగ్ అనుభవాన్ని అందించేందుకు మదనపల్లె పట్టణంలో మూడురోజుల జ్యువెలరీ ఎగ్జిబిషన్‌ను నిర్వహిస్తోంది. శనివారం స్థానిక పుంగనూరురోడ్డులోని ఎస్‌జేఆర్ కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన జోయాలుక్కాస్ జ్యువెలరీ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చైర్‌పర్సన్ మనూజారెడ్డి ప్రారంభించారు. గోల్డ్, డైమండ్, జ్యువెలరీ,ప్రెషస్ స్టోన్స్‌కు సంబంధించి సరికొత్త డిజైన్స్, విస్తృతశ్రేణి కలెక్షన్‌ను తిలకించారు. జోయాలుక్కాస్ ప్రతినిధులు మాట్లాడుతూ.. శని, ఆది, సోమవారాలు మూడురోజుల పాటు జరిగే తమ ఎగ్జిబిషన్ కమ్ సేల్‌ను పట్టణ ప్రజలు ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.


జోయాలుక్కాస్ ఎగ్జిబిషన్‌లో ఆభరణాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

శ్మశానం ధ్వంసంపై రెవెన్యూ అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

గుర్రంకొండ : ఇటీవల ప్రచురితమైన శ్మశానాన్ని ధ్వంసం చేసిన టీడీపీ నాయకులు అన్న కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. శనివారం ఆర్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని అధికారుల బృందం మండలంలోని టి.పసలవాండ్లపల్లెకు చేరుకొన్నారు. టి.పసలవాండ్లపల్లె, చాగలపల్లెకు మధ్యలో ఉన్న వివాదస్పద శ్మశాన స్థలాన్ని సర్వేచేయించారు. అక్కడ ధ్వంసానికి గురైన సమాధులను పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సదరు స్థలం ఉన్న సర్వే నెంబర్లను పరిశీలించారు. సర్వేనెంబరు 214లో ఉన్న మొత్తం విస్తీర్ణం 3.08 ఎకరాల స్థలం రాస్తాపోరంబోకుగా నిర్ధారించారు. అందులో నాలుగు దశాబ్దాలుగా సమాధులు వేసుకొంటున్న శ్మశాన స్థలం కూడా పట్టా స్థలం కాదని రాస్తాపోరంబొకులో ఉండేదని తేల్చారు. శ్మశాన స్థలం మొత్తం సర్వేచేసి నాలుగుసెంట్లు శ్మశానంకు కేటాయిస్తూ సరిహద్దు రాళ్లు నాటారు. దీంతో వివాదం సద్దుమనిగింది. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.


శ్మశాన స్థలాన్ని సర్వేచేస్తున్న రెవెన్యూ అధికారులు

పీఎం కిసాన్‌కు ఈకేవైసీ తప్పనిసరి

వాల్మీకిపురం : ఈకేవైసీ చేసుకుంటేనే పీఎం కిసాన్ 13వ విడత నగదు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ అన్నారు. శనివారం వాల్మీకిపురం–1 రైతు భరోసా కేంద్రంను ఆకస్మికంగా తనిఖీ చేసి, రైతు భరోసా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులు దగ్గరలోని సిఎస్‌సి సెంటర్లు, రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. అలాగే ఈ–పంట నమోదు, రైతు భరోసా కేంద్రాల్లో లభించే ఎరువుల లభ్యతపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏడీఏ వాణిశ్రీ, ఏవో హేమలత, సిబ్బంది నవీన్ కుమార్, అనూష, రాజేష్ పాల్గొన్నారు.

కలకడ : జిల్లాలోని ప్రతి రైతూ పంటసాగుతో పాటు ఈకేవైసీ తప్పని సరిగా చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని ఎర్రకోటపల్లె రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈనెల15వ తేదీ లోపు ఈకేవైసీ పూర్తి చేసుకున్నవారికి మాత్రమే పీఎం కిసాన్ నగదు జమ అవుతుందన్నారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద అర్హత కలిగిన లబ్ధిదారుల జాబితా సిద్ధంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులు సాగుచేసే ప్రతి పంట ఆన్‌లైన్‌లో నమోదు చేసేబాధ్యత ఏఈఓ పై ఉందని గుర్తు చేశారు.


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉమామహేశ్వరి

మహిళలు ఆర్థికంగా వృద్ధి సాధించాలి

కలికిరి : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి కృషి చేయాలని లైవ్‌లీహుడ్ డీపీఎం రూతు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శనివారం సూక్ష్మ, చిన్న తరహా ఆహార పరిశ్రమల స్థాపనపై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ, ప్రధానమంత్రి ఆహార శుద్ధి క్రమబద్ధీకరణ(పీఎంఎఫ్ఎంఈ), కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో పొదుపు సంఘాలకు అందుబాటులో ఉన్న ఆహారశుద్ధి ఉత్పత్తులు, ఆహార పరిశ్రమల స్థాపన, ఇందుకు అవసరమైన ప్రభుత్వ అనుమతులు, రుణ సదుపాయం, రాయితీలు, ప్రోత్సాహకాలు తదితరాలపై మహిళలకు తెలియజేశారు. నూతన సాంకేతిక పద్ధతుల్లో ఆహార పరిశ్రమల ఏర్పాటు, వ్యాపార వృద్ధి, విస్తరణపై అవగాహన కల్పించారు. ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ మాస్టర్ ట్రైనర్ హేమాద్రి ఆహార శుద్ధి పరిశ్రమలపై మహిళలకు వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం దేవసేన, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణ పనులు వేగవంతం చేయండి

వాల్మీకిపురం : జగనన్న కాలనీలో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ సాంబ శివయ్య అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ గిరీషా ఆదేశాల మేరకు జగనన్న కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇచ్చిన లక్ష్యం సకాలంలో పూర్తి చేయాలని, హౌసింగ్ లబ్ధిదారుల విషయంలో ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. అలాగే చీకటిపల్లి ఇసుక రీచ్‌ను పరిశీలించి, లబ్ధిదారులకు ఇసుక సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్, తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్, ఏఈ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.